బీసీ సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి

కాచిగూడ, డిసెంబర్ 26: కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో బీసీ సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నింబోలిఅడ్డాలో మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు దూరమవుతున్న బీసీ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని తక్షణమే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. బీసీల కుల వృత్తుల వారికి సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని కోరారు. కృష్ణ, ముత్యాల్‌రావు, ప్రదీప్‌గౌడ్, కిశోర్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

కాచిగూడ, డిసెంబర్ 26: కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని గాయకురాలు, ఎస్‌పీ నిర్మల సాంస్కృతిక, సంగీత సేవా సంస్థ అధ్యక్షురాలు నిర్మల పిలుపునిచ్చారు. సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో వివేకానంద సేవా సంఘం ఆశ్రమంలో గురువారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల ఆకలిని తీర్చడానికి అన్నదానాలు ఎంతగానో దొహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు..

తెలంగాణ ముఖ్యమంత్రి సలహాదారుడు వి.నరేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో గురువారం కలిసి బొకే ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీలం వెంకటేశ్, వేముల రామకృష్ణ, రాఘవేంద్ర, చందు పాల్గొన్నారు.

– కాచిగూడ, డిసెంబర్ 26

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 26: గత ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆశా వర్కర్ల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చంలో ఘోరంగా విఫలమైందని సనత్‌నగర్ జోన్ సీఐటీయూకన్వీనర్ పి.మల్లేశ్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామంటూ ఇచ్చిన హామీలేమయ్యాయని ప్రశ్నించారు. నాయమైన తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 31న ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌లో బస్ జాతా ముగింపు సభ జరుగనుందని అన్నారు. గురువారం జరిగిన సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా బోయిగూడలోని గాంధీ ఆరోగ్య కేంద్రంలో సీఐటీయూ టీజీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి అనిత, వెంకటమ్మ, పద్మసుశీల, మహేశ్వరి, వరలక్ష్మి, నందినితో కలిసి పోస్టర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు.

కొత్త రోడ్డు..తవ్వేశారు

- అవస్థలు పడుతున్న వాహనదారులు, స్థానికులు
- పట్టించుకోని అధికారులు

వైభవ్‌నగర్‌లో అనుమతి లేకుండా తవ్విన కొత్త రోడ్డు

అంబర్‌పేట, డిసెంబర్ 26 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారులు కొందరి స్వయంకృతాపరాధంతో ధ్వంసమవుతున్నాయి. నిర్మించిన కొద్ది రోజులకే డ్రైనేజీ పైప్‌లైన్, తాగునీటి కనెక్షన్, స్పీడ్ బ్రేకర్ల పేరుతో ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. దీంతో రహదారులకు ఏటా కోట్లలో నష్టం వాటిల్లుతోంది.

లక్షలు వెచ్చించి ఏడాది క్రితం నిర్మాణం..

స్థానికుల కోరిక మేరకు ఏడాది క్రితం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ లక్షలు వెచ్చించి వైభవ్‌నగర్‌లో కొత్త సీసీ రోడ్డును నిర్మించారు. అయితే రోడ్డు నిర్మించినప్పుడు మిన్నకుండిన ఓ ఇంటి యజమాని రాత్రికి రాత్రే దొంగతనంగా 20 ఫీట్ల వరకు తవ్వి పైప్‌లైన్ వేశాడు. అయినప్పటికీ వాటర్‌వర్క్స్ అధికారులు కానీ, జీహెచ్‌ఎంసీ అధికారులు కానీ చూసీచూడనట్లు మిన్నకుండిపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టు చప్పుడు కాకుండా సదరు వ్యక్తి దగ్గర డబ్బులు తీసుకొని రోడ్డును తవ్వించినట్లు ఆరోపణలున్నాయి.

అనుమతి తీసుకుంటే ఛార్జీలు ఇలా..

సిమెంట్ రహదారులైతే ఒక చ.మీ. రోడ్డు కటింగ్‌కు రూ. 2,040, బీటీ రోడ్డుకు రూ.3,250 చెల్లించాల్సి ఉంటుంది. చాలా మంది రోడ్డు కటింగ్ ఛార్జీలను తప్పించుకోవడానికి అనుమతి లేకుం తవ్వేస్తున్నారు.

రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలి..

తవ్విన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు కోరారు. డబ్బులకు ఆశపడి మంచి రోడ్డును తవ్వుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

జాతీయ మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్‌ఖన్నా

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 26 : తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ 78క్యాడర్లలో పని చేస్తున్న 17, 541మందికి రెగ్యులర్ బేసిక్ పే వెంటనే అమలు చేయాలని జాతీయ మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన పీఆర్‌సీ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. 1వ తేదీన వేతనాలు అందించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టకపోవడం శోచనీయమని ఆయన అన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారిణులు

రవీంద్రభారతి, డిసెంబర్ 26 : కళానృత్య నికేతన్ స్కూల్ ఆఫ్ కూచిపూడి అకాడమీ 16 వ వార్షికోత్సవవాల సందర్భంగా కళానృత్య నికేతన్ అధ్యక్షురాలు నాట్యగురువు డాక్టర్ బిందు అభినయ్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శన గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళానృత్యనికేతన్ సంస్థను 2007లో స్థాపించి హైదరాబాద్ నగరం మంతా వివిధ శాఖలుగా విస్తరించి కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 146మంది ప్రదర్శించిన కూచిపూడి నృత్యం వీక్షకులను ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ పద్మజారెడ్డి, భాగవతుల సేతురామ్, కళాకృష్ణ, పద్మశ్రీ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

28న రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 26 : తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్‌రోడ్డు బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో డిసెంబర్ 28న శనివారం ఉదయం 10గంటలకు ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా 86వ జయంతి సందర్భంగా పలువురు ప్రొఫెసర్లకు రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రతన్‌టాటా జీవిత చరిత్రపై నగరంలోని పలు ఎంబీఏ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికల పురుశోత్తం, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ తదితరులు పాల్గొంటారని రాజ్‌నారాయణ్ ముదిరాజ్ పేర్కొన్నారు.

వీర్‌బల్ దివస్

మొజాంజాహి మార్కెట్ వద్ద గురుగోవింద్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రార్థనలు చేస్తున్న రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ తివారి, జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ తదితరులు

అబిడ్స్, డిసెంబర్ 26 : వీర్‌బల్ దివస్ కార్యక్రమంలో భాగంగా మొజాంజాహి మార్కెట్ వద్ద గురు గోవింద్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్దార్ ఇందర్‌సింగ్, సర్దార్ రాజేంద్రసింగ్ టక్రాల్, సర్దార్ గురుదయాల్ సింగ్ గుల్లు, అమిత్ కార్వాండ, ఆనంద్ చౌదరి, చందు సార్ధ, సర్దార్ మోహన్‌సింగ్, అవినాష్ దేవ్డా, వినోద్ చౌదరి, సందీప్ జైన్, చంద్రశేఖర్ తివారి తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం

సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

రవీంద్రభారతి, డిసెంబర్ 26 : న్యూ ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాలు గురువారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఉమర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు , క్రీడలు, సాంస్కృతిక కళలలో నిష్టాత్ములుగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. పాఠశాల రెండవ వార్షికోత్సవం పురస్కరించుకొని రవీంద్రభారతిలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అవార్డులు ప్రదానం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.హెచ్ఓ రాఘవేంద్ర, సయ్యద్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌దయాల్ శర్మ వర్ధంతి

దివంగత మాజీ రాష్ట్రపతి శంకర్ దయాల్ శర్మ వర్ధంతి కార్యక్రమాన్ని గాంధీభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేస్తుకున్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి. కుమార్‌రావు, కార్యదర్శి మణిలాల్‌షా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, జరీనా, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

– అబిడ్స్, డిసెంబర్ 26

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం కార్వాన్, చార్మినార్ ఎమ్మెల్యేలు కౌసర్‌మొహినుద్దీన్, మీర్ జుల్ఫికర్ అలీ, ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్ ఖాద్రి ఆవిష్కరించారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 26

మల్లేపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

మల్లేపల్లి డివిజన్‌లో గురువారం నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్తానికులతో పలు సమస్యలపై చర్చించారు. మౌలిక సదుపాయాలను కల్పించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 26

వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌస్ డివిజన్ గోల్కొండ ఛోటాబజార్‌లో వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ పనులను ఏఈ ఫరీద్‌తో కలిసి ఎంఐఎం నాయకులు వజీ ఉజ్జమాసిద్ధికీ, ఆజం పర్యవేక్షించారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 26

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఆర్యసమాజ్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న గోషామహర్ పరిరక్షణ సమితి ప్రతినిధుల, స్థానికులు

అబిడ్స్, డిసెంబర్ 26 : గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖానను నిర్మించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని గోషామహల్ పరిరక్షణ సమితి ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉస్మానియా దవాఖాన హటావో, గోషామహల్ పోలీస్ స్టేడియం బచావో పేరిట గోషామహల్ ఆర్యసమాజ్ వద్ద స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు తమ ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే జేఏసీని ఏర్పాటు చేసి ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్ యాదవ్, కోటి శైలేష్ కురుమ, దత్తు, పశుపతి, చీలంపల్లి సురేశ్, రాము, బి. శ్రీనివాస్, ఎ. రవి, ఓం, శైలేంద్ర సాగర్, దుర్గా, అర్జున్, లడ్డు, కె. సంధ్యారాణి, కె. లక్ష్మి, కె. నిర్మల వీరేందర్ కిరణ్, వాసు యాదవ్, నేహాన్, విష్ణు, శివ తదితరులు పాల్గొన్నారు.

టోలిచౌకిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు

- భవనం చూడాలని నగర సీపీ ఆదేశం
- కొత్త సంవత్సరంలో పోలీస్ స్టేషన్ ప్రారంభానికి అధికారుల కసరత్తు

గోల్కొండ ఏసీపీ కార్యాలయం

మెహిదీపట్నం, డిసెంబర్ 26: ప్రజలకు శాంతి, భద్రతలను అందించడానికి తెలంగాణ పోలీస్ విభాగం ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లను గత తెలంగాణ ప్రభుత్వం విభజించగా కొత్తగా ఇప్పుడు ప్రభుత్వం మరోసారి నూతన పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తుంది. దక్షిణ, పశ్చిమ మండలంలోని గోల్కొండ డివిజన్‌లో ప్రస్తుతం గోల్కొండ, లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్లు ఉండగా ఇప్పుడు కొత్తగా టోలిచౌకిలో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు హుమాయూన్‌నగర్, ఫిలింనగర్, గోల్కొండ పోలీస్ స్టేషన్ల నుంచి ప్రాంతాలను ఎంపిక చేసి టోలిచౌకి పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణ, పశ్చిమ, పశ్చిమ మండలాల డీసీపీలకు నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. నూతన సంవత్సరంలో పోలీస్ స్టేషన్ ప్రారంభించడానికి అధికారులు భవనం వెతికే పనిలో పడ్డారు. టోలిచౌకి ఫ్లైఓవర్ నుంచి గచ్చిబౌలి వెళ్లే రోడ్డులో టోలిచౌకి చౌరస్తా నుంచి కుడివైపు ఉన్న ప్రాంతాలు, టోలిచౌకి చౌరస్తానుంచి సెవన్ టూంబ్స్‌కు వెళ్లే రోడ్డులో కుడివైపున మాజీ ఎమ్మెల్యే అఫ్సర్‌ఖాన్ ఇంటికి వెళ్లే ప్రధాన రోడ్డు కుడివైపు ప్రాంతాలను కలిపి టోలిచౌకి పోలీస్ స్టేషన్‌ను రూపొందించారు.

29న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులతో ఆత్మీయ సమ్మేళనం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 26 : విజయ్‌నగర్ కాలేజీ ఆఫ్ కామర్స్‌లో 1978నుంచి 2004వరకు ఎకనామిక్స్ అధ్యాపకురాలిగా విశిష్ట సేవలందించిన భవానిదేవి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందితో కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని మాసబ్‌ట్యాంకు మహావీర్ ఆసుపత్రి ఎదురుగా గల జేఎన్ఏఎఫ్ఏయూలోని ఆడిటోరియంలో డిసెంబర్ 29నఆదివారం ఉదయం 10గంటలకు ఏర్పాటు చేయనునట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను విద్యాబోధనలతో తీర్చిదిద్దిన విద్యార్థులను, తనతో పనిచేసిన అధ్యాపకులను, సిబ్బందిని కలవడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణ

కాచిగూడ, డిసెంబర్ 26: విద్యార్థులు కరాటేను నేర్చుకోవడానికి ముందుకు రావాలని వరల్డ్ రికార్డ్స్ హోల్డర్, కరాటే మాస్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి అన్నారు. చలికాలాన్ని పురస్కరించుకుని జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జనవరి 10వ తేదీ వరకు విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కరాటే ఆవశ్యకతను వివరిస్తూ అవసరమైన మెలకువలను నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9494112424లో సంప్రదించాలని అన్నాను.

రింగ్ టెన్నిస్‌లో అంబర్‌పేట విద్యార్థుల ప్రతిభ

వారాణాసిలో ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహించిన అండర్-15 రింగ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో అంబర్‌పేటకు చెందిన బాల బాలికలు 10 మంది పాల్గొని ప్రతిభ చాటారు. 2 వెండి పథకాలు, 3 కాంస్య పథకాలు,4 ఇతర మెడల్స్‌ను సాధించారు. గురువారం రింగ్ టెన్నిస్ జాతీయ కార్యదర్శి శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం సహకారం అందిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు.

– కాచిగూడ, డిసెంబర్ 26

నేటి నుంచి స్టాన్లీలో అంతర్జాతీయ సదస్సు

అబిడ్స్, డిసెంబర్ 26 : స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రీసెర్చ్ ఇన్ ఇంటెలిజెంట్ కంప్యూటింగ్ ఇన్ ఇంజినీరింగ్(RICE-2024)పై అంతర్జాతీయ సదస్సును ఈ నెల 27వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక తెలిపారు. కళాశాలలో ఆయన గురువారం మాట్లాడుతూ.. సదస్సును మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ హైదరాబాద్, యూనివర్సిటీడాడ్ డాన్ బోసో ఎల్ సాల్విడార్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందని, ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన హాజరవుతున్నట్లు తెలిపారు. గౌరవ అతిథులుగా హనోయ్ యూనివర్సిటీ ఆఫ్ ఇండస్ట్రీ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ నుయెన్ హాంగ్ సన్, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎల్ శ్యామల పాల్గొంటారన్నారు. కంప్యూటర్ టెక్నాలజీ, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, ఎడ్జ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో పరిణతి చెందిన పరిశోధకులు తమ పరిశోధనలను రెండు రోజుల సదస్సులో ఉంచుతారన్నారు. నేపాల్ కాఠ్మండు యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సుడాన్ ఝా, మలేషియా లింకాల్న్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ మిథున్ చక్రవర్తి, వియత్నాం దేశం యూనివర్సిటీ ఆఫ్ ఇండస్ట్రీకి చెందిన డాక్టర్ బుటీయన్, బహ్రెన్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ అబ్దుల్ ఖాదర్ జిలాని, డాక్టర్ రజీబ్‌లు ప్రధాన వక్తలుగా పాల్గొంటున్నారని వివరించారు. నేపాల్, బంగ్లాదేశ్, వియత్నాం, ఎల్ సాల్వడార్ తదితర దేశాలకు చెందిన పరిశోధకులు తమ పేపర్లను సమర్పించనున్నారు. స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ బిషప్ డాక్టర్ ఎంఏ డేనియల్, కళాశాల కరెస్పాండెంట్ కె కృష్ణారావు, అకడమిక్స్ డీన్ డాక్టర్ వినయ్ బాబు, ప్రోగ్రాం చైర్మన్ డాక్టర్ విజయేందర్ కుమార్ సోలంకి, డాక్టర్ ఎం. స్వప్న, డాక్టర్ శివాని యాదవ్, డాక్టర్ జి కార్తిక్‌లతో పాటు ప్రొఫెసర్‌లు, అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు.

ప్రైవేట్ హాస్టళ్లను మూసివేయాలి

- విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

ప్రైవేట్ హాస్టళ్లను మూసివేయాలని ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

చిక్కడపల్లి, డిసెంబర్ 26: ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మహాలక్ష్మి గర్ల్స్ హాస్టల్‌ను మూసి వేయాలని, విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన వార్డెన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం ఆ హాస్టల్ ముందు ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డీవైఎఫ్ఐ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావీద్ మాట్లాడారు. ఇరుకైన గదుల్లో వసతి కల్పిస్తూ అధిక ఫీజుల వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మహాలక్ష్మి హాస్టల్‌లో శ్యామ్ బాబు అనే వార్డెన్ విద్యార్థునులతో అనుచితంగా ప్రవర్తిస్తూ ఫీజుల పేరుతో వేధిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని అన్నారు. పుట్టగొగుల్లాగా పుట్టుకొస్తున్న హాస్టల్స్‌పై ప్రభుత్వం నిరంతరం నిఘా పెట్టి కనీస నిబంధనలు పాటించని హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లెనిన్, ప్రశాంత్, శ్రీమాన్, చరణశ్రీ, విగ్నేష్, రాజేశ్, పద్మ, కుమార్, నరేశ్, మరన్నా తదితరులు పాల్గొన్నారు.